కానరాదాయె.. దీపావళి కళ!



భీమడోలులో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు



భీమడోలులో టపాసుల విక్రేతలకు సూచనలందిస్తున్న అధికారులు

గణపవరం: ఒకప్పుడు ఇంటి చుట్టూ ప్రమిదల వెలుగులు, బాణసంచా మోతలు, ఇంటి నిండా పిండి వంటలు, కొత్త అల్లుళ్ల హడావిడి, బంధుమిత్రులతో కళకళలాడిన దీపావళి పండుగ సందడి కొంత కాలంగా మసకబారుతుంది. కొండెక్కి కూర్చున్న నిత్యావసర సరకుల ధరలు, చుక్కల సరసన చేరిన బాణసంచా ధరలు, కనీసం పిండి వంటలు చేసుకునేందుకు ధైర్యం చాలని విధంగా పప్పులు, వంట నూనెల ధరల పెరుగుదలతో దీపావళి పండగ నానాటికీ తన ప్రాభవాన్ని కోల్పోతుంది. దీనికి తోడు ఆధునిక సాంకేతిక పోకడలతో ప్రజల అభిరుచుల్లో మార్పు, ఉపాధి వేటలో తలమునకలైన యువత దీపావళి పండగపై అంతగా ఆసక్తి చూపకపోవడం పట్టణీకరణ ప్రభావం వంటి పలు కారణాలు దీపావళి వైభవాన్ని మసకబారుస్తున్నాయి.

కనుమరుగైన ప్రమిదలు

దీపావళి పండగ అంటేనే దీపాల పండుగ. ఒకప్పుడు ఇంటి చుట్టూ, అరుగుల మీద, ప్రహరీ గోడల మీద, డాబాల మీద వందల సంఖ్యలో ప్రమిదలు పెట్టి ఎంతో ఆనందంగా వెలిగించే వారు. ఈ ప్రమిదల కాంతులు నాగుల చవితి వరకూ కొనసాగేవి. ప్రస్తుతం పెరిగిన నూనె ధరలతో శాస్త్రానికి రెండో మూడో ప్రమిదలను గుమ్మం ముందు వెలిగించి దీపావళి పండగను మమా అనిపిస్తున్నారు.

అరకొరగా పిండి వంటలు

దీపావళి పండగకు రకరకాల పిండి వంటలు చేసుకుని తెలిసిన వారికి, బంధు మిత్రులకు పంపడం ఆనవాయితీగా వస్తుంది. అయితే ప్రస్తుతం చాలా మంది అలాంటి మొహమాటాలకు చెక్ పెట్టారు. వంటనూనెల ధరలతో పాటు పిండి వంటలకు ఉపయోగించే పప్పులు, ఇతర పచారి సరకుల ధరలు భగ్గుమనడంతో ఇంట్లోకి సరిపడా మాత్రమే పిండి వంటలను చేసుకుంటున్నారు.



గణపవరం: కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న బాణసంచా దుకాణం



గణపవరం: గతంలో ఇంటి చుట్టూ కాంతులీనుతున్న ప్రమిదలు

దీపావళి పండగ పిల్లలదే

దీపావళి పండగ అంటేనే పిల్లల మొహాల్లో ఎక్కడా లేని ఆనందం కనిపిస్తుంది. ఎంత బాణసంచా ధరలు మండిపోతున్నా పిల్లల కోసమైనా బాణసంచా కొనాల్సిందే. లేకపోతే ఇంటిలో టపాసులను మించిన సౌండ్లు వినాల్సి వస్తుంది. దీంతో మందుగుండు సామగ్రి కొందామని బాణసంచా దుకాణానికి వెళితే కనీసం వెయ్యి రూపాయలు లేకుండా క్యారీ బ్యాగులోకి మందులు రావడం లేదు.

పండగ మాటున పొంచి ఉన్న ప్రమాదం

భీమడోలు: దీపావళి ప్రతి ఇంటా వెలుగులు నింపే పండగ. సంతోష చిహ్నంగా చీకటిని పారదోలుతూ దీపాలను వెలిగించి, విజయ సూచకంగా టపాసులు కాల్చే ఆచారం అనాదిగా వస్తుంది. బాణసంచా కాల్చేటప్పుడు చేసే చిన్న తప్పిదం విషాదంగా మారకుండా ఉండేలా జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచిస్తున్నారు. గతేడాది జిల్లా వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో జరిగిన బాణసంచా పేలుడు, ఇతర ప్రమాదాలు పలు కుటుంబాల్లో విషాదాన్ని నింపాయి. అలాంటి సంఘటనలు జరగకుండా పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక శాఖలు, ఇతర శాఖలు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాయి. టపాసుల విక్రయ కేంద్రాలకు అనుమతు లున్నవే పని చేయాలని అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేంద్రాలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గత ఏడాది కన్నా 30 శాతానికి పైగా ధరలు పెరగడంతో బాణసంచా కొనుగోళ్లు తగ్గాయని నిర్వాహకులు అంటున్నారు. ప్రజలకు ధరలు అందుబాటులో లేకపోవడంతో దుకాణాలు వెలవెలబోతున్నాయి.

టపాసులు కాల్చేటప్పుడు కాటన్ దుస్తులను ధరించాలి

- పిల్లలు పెద్దలు, తల్లిదండ్రుల పర్యవేక్షణలో కాల్చాలి.
- ఎల్లప్పుడూ ఇంటి బయటే వెలిగించాలి.
- గుడిసెలు, గడ్డివాములు, పెట్రోలు బంకుల సమీపంలో బాణసంచా కాల్చకూడదు.

విపత్తు జరిగితే..

ఆపద, అత్యవసర పరిస్థితి జరిగితే 100, 101, 108, 112 ఫోన్ నంబర్ల ద్వారా అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాలి. అనుమతించిన ప్రదేశాల్లో మాత్రమే బాణసంచా దుకాణాలు ఉండాలి. సల్ఫర్, గన్‌పౌడర్ వేర్వేరుగా ఉంచడంతో పాటు రెండు అగ్ని మాపక సిలిండర్లను సిద్ధం చేసుకోవాలి. బాణాసంచా ప్యాకింగ్ కోసం ప్లాస్టిక్ కవర్లు కాకుండా కాగితపు ప్యాకింగ్ చేయాలి. తక్కువ పొగ, శబ్దం గల గ్రీన్ క్రాకర్స్‌ను వాడాలి.

వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలి



బాణసంచా విక్రయ సమయంలో వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలి. భీమడోలు సంత మార్కెట్ సమీపంలో ఏర్పాటు చేసిన ఆరు తాత్కాలిక దుకాణాలను పరిశీలించాం. దుకాణాలవద్ద విధులు నిర్వహించే రెవెన్యూ, ఫైర్, విద్యుత్ శాఖల సిబ్బందితో పాటు వ్యాపారులకు మార్గదర్శకాలను వివరించి నిబంధనలను విధిగా పాటించాలని కోరాం.

– యూజే విల్సన్, సీఐ, భీమడోలు

పర్యావరణహితంగా పండగ చేసుకోవాలి



భీమడోలు: ప్రతి ఇంటా నిర్వహించుకునే దీపావళి పర్యావరణ హితంగా ఉండాలి. పెద్ద శబ్దాలతో భారీ పొగ వచ్చే టపాసులను కాల్చడం వలన వాయు, ధ్వని కాలుష్యం కలుగుతుంది. దీని వలన పిల్లలు, పెద్దలకు అనారోగ్య సమస్యలు వస్తాయి. ఇంటి వద్ద టపాసులు కాల్చే చిన్నారులను పెద్దలు పర్యవేక్షించాలి. నీళ్లను అందుబాటులో ఉంచుకోవాలి. సగం కాలిన బాణసంచాను వెంటనే నీటితో ఆర్పాలి.

– సునీత, సూపరింటెండెంట్, సామాజిక ఆరోగ్య కేంద్రం, భీమడోలు

క్లుప్తంగా

లండన్‌లో వైఎస్సార్ సీపీ అధినేతతో అబ్బయ్యచౌదరి భేటీ



వైఎస్ జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

దెందులూరు: లండన్‌లో ఆదివారం వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితో దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి భేటీ అయ్యారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ దెందులూరు నియోజకవర్గంలో కోటి సంతకాల సేకరణ గ్రామాల్లో అవగాహన సమావేశాలు విస్తృతంగా నిర్వహిస్తున్నామని వివరించారు. కోటి సంతకాల సేకరణలో వైఎస్సార్‌సీపీ అన్ని విభాగాల శ్రేణులతోపాటు ప్రజలు స్వచ్ఛందంగా సంతకాలు చేస్తున్నారని వివరించారు.

హైస్కూల్ గ్రౌండ్‌లో నిలిచిన నీరు



కైకరం జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో నిండిపోయిన వర్షం నీరు

ఉంగుటూరు : కైకరం జిల్లా పరిషత్ హైస్కూలు గ్రౌండులో వర్షం నీరు చేరడంతో విద్యార్థులకు ఆడటానికి వీలులేకుండా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రౌండులో నీరు చేరింది. గతంలో ఇలాంటి పరిస్థితి ఉంటే మెరక చేశారు. కొంత కాలం బాగానే ఉంది. ప్రస్తుతం ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీరు నిలిచిపోయింది. నీరు పోయే మార్గం కూడా లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న పశు వైద్యాధికారి హరికృష్ణ

దెందులూరు: మండలంలో నెల రోజులుగా 17,350 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశామని దెందులూరు మండల పశు వైద్య శాఖ అధికారి హరికృష్ణ అన్నారు. ఆదివారం కొవ్వలి పశు వైద్యశాలలో ఆయన మాట్లాడుతూ మండలంలో ఆరు పశు వైద్యశాలల్లో 28మంది సిబ్బంది 15రోజులపాటు పశువులకు టీకాలు వేశారన్నారు. కొన్ని గ్రామాల్లో ఇంకా 400 పశువులకు టీకాలు వేయాల్సి ఉందని, త్వరలో వాటికి టీకాలు వేస్తామని రైతులకు వివరించారు.

ఈ రోడ్డు పరిస్థితి ఇంతేనా?



అధ్వానంగా ఉన్న రహదారి

దెందులూరు: దెందులూరు బీఎస్ఎన్ఎల్ టవర్ వద్ద రోడ్డు అధ్వానంగా ఉందని పాదచారులు, ప్రయాణికులు వాపోతున్నారు. దెందులూరు నుంచి కొవ్వలి, ఏలూరు, గుండుగొలను వెళ్లే ప్రయాణికులు, పాదచారులు ప్రతి రోజూ నరకాన్ని చూస్తున్నామని గతంలో నియోజకవర్గంలో గుంతలు పూడ్చడానికి నిధులు ఇచ్చినా పూడ్చలేదని పాదచారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాందీ ప్లాంటు మరమ్మతులకు సన్నాహాలు

ఉంగుటూరు: ఉంగుటూరు పంచాయతీలో సరైన అజమాయిషీ లేక మూతబడిన నాందీ ఫౌండేషన్ వాటర్ ప్లాంటుకు తిరిగి మరమ్మతులు ప్రారంభించేందుకు దాతలు సన్నాహాలు చేస్తున్నారు. పంచాయతీ సహకారంతో గతంలో ఎన్ఆర్ఐ పాతూరి నాగశిరోమణి ఈ ప్లాంటును నిర్మించారు. నాలుగేళ్ల క్రితం ఈ ప్లాంటును పంచాయతీకి ఇవ్వమని పాలకవర్గం అడగడంతో ఆ మేరకు అప్పగించారు. ఆ తర్వాత నిర్వహణా లోపం వల్ల ప్లాంటు మూలనపడింది. తాజాగా దాతల తరఫున పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేయడంతో తిరిగి ప్లాంటును దాతలకు అందజేశారు. ఈ నేపథ్యంలో దాతలు ఈ ప్లాంటుకు సంబంధించి మరమ్మతు పనులు చేపట్టేందుకు వ్యయ అంచనా చేపట్టగా నిపుణులు రూ.4 లక్షలు ఖర్చవుతుందని వెల్లడించారు. ఇప్పటికి రూ.2 లక్షలు మరమ్మతుల కోసం సేకరించామని, మరో రూ.2 లక్షలు సేకరించిన అనంతరం పనులు ప్రారంభిస్తామని ఏఎంసీ మాజీ చైర్మన్ కొండ్రెడ్డి సర్వేశ్వరరావు తెలిపారు. దీంతో త్వరలో ప్లాంటు ద్వారా సురక్షిత తాగునీరు ప్రజలకు అందుబాటులోకి వచ్చే అవకాశముంది.

చెరువులపై శాశ్వత హక్కు కల్పించాలి



మాట్లాడుతున్న రజక సంఘం జిల్లా అధ్యక్షులు కట్లయ్య

దెందులూరు: గ్రామాల్లో చెరువులపై రజకులకు శాశ్వత హక్కు కల్పించాలని రజక సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య అన్నారు. ఆదివారం కొవ్వలి రజక జన సంఘం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రభుత్వం రజక వృత్తిలో భద్రత, భవిష్యత్ అభివృద్ధి, సంక్షేమనాణికి చర్యలు తీసుకోవాలన్నారు. రజక చెరువుల్లో ఆక్రమణలు తొలగించి ఫెన్సింగ్ వేయించాలన్నారు. సమావేశంలో జిల్లా అధికార ప్రతినిధి సీహెచ్ సాంబశివరావు ఏలూరు పట్టణ అధ్యక్షులు వై నాగ శేషు కొవ్వలి రజక సంఘం కమిటీ సభ్యులు ఉన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కొవ్వలి రజక సంఘం అధ్యక్షుడిగా గోవాడ సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా గోవాడ శ్రీరాములు, గొల్లపూడి వెంకటేశ్వరరావు, వీరవల్లి సుబ్బారావు ఎన్నికయ్యారు. కార్యదర్శిగా గోవాడ దుర్గాప్రసాద్ సహాయ కార్యదర్శిగా గోవాడ అంజి కోశాధికారిగా గొల్లపూడి శ్రీనివాసరావు సభ్యులుగా గొల్లపూడి సోమయ్య కూరపతి గాంధీ కూ రపాటు లక్ష్మి టీకు వెంకటరమణ గోవాడ గాంధీ ఎన్నికయ్యారు. జిల్లా జాయింట్ సెక్రెటరీ గోవాడ శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. అనంతరం కొవ్వలి రజక సంఘం నూతన కమిటీతో జిల్లా అధ్యక్షులు కట్లయ్య జిల్లా అధికార ప్రతినిధి సీహెచ్ సాంబశివరావు ఏలూరు పట్టణ అధ్యక్షులు ప్రమాణ స్వీకారం చేయించారు.

దీపావళి ప్రమిదలు సిద్ధం



దుకాణం వద్ద ప్రమిదలు కొనుగోలు చేస్తున్న జనం

దీపావళి రాకతో ఆదివారం మార్కెట్‌లో పలు అకృతుల్లో ప్రమిదలు, మట్టి కుండలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. చీకట్లను పారద్రోలి వెలుగులను నింపే ఈ పండగను ప్రతి ఇంటా ఆనందోత్సాహలతో నిర్వహించుకోవాలి. దీంతో దీపాలను ఓ శ్రేణి మాదిరిగా దీపోత్సవం చేసి పూజలు చేయడం సంప్రదాయబద్ధంగా వస్తుంది. ఈ క్రమంలో మార్కెట్‌లో సాధారణ ప్రమిదలతోపాటు డిజైన్ గల ప్రమిదలు వచ్చాయి. అదే విధంగా బొమ్మల మట్టి కుండలు ఆకర్షణీయంగా మారాయి. వాటిని కొనేందుకు మహిళలు, జనం ఆసక్తి చూపుతున్నారు. గతేడాది కన్నా రెట్లు రెట్టింపు ఉండడంతో తక్కువగా కొనుగోలు చేస్తున్నారు. - భీమడోలు

ఉపాధి హామీ పటిష్టంగా అమలు చేయాలి



కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ కార్మిక సంఘ నేతలు

నిడమర్రు: గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టం పటిష్టంగా అమలు చేయాలని జిలా ప్రజా సంఘాల కన్వీనర్ రమణారావు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఆదివారం నిడమర్రు ప్రజా సంఘాల భవనంలో లావేటి చంద్రరావు అధ్యక్షతన వ్యవసాయ కార్మిక సంఘం, మండల ప్రధాన మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ పని ప్రదేశాల్లో కూలీలకు తగిన సౌకర్యాలు కల్పించాలని, ఉపాధి కూలీలకు 200 పనిదినాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం మండల వ్యవసాయ కార్మిక సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఉడ్డవోలు వెంకటేశ్వరరావు, గౌరవ అధ్యక్షుడిగా లావేటి చంద్రరావు, ప్రధాన కార్యదర్శిగా గవర సత్యనారాయణ తదితర 12 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఒక భక్తురాలు ఆదివారం రూ.1,00,116 విరాళంగా అందజేశారు. తాడేపల్లిగూడెంకు చెందిన పెండ్యాల కనకమహాలక్ష్మి ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దాతకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

జూదరుల అరెస్ట్

ద్వారకాతిరుమల: మండలంలోని గుండుగొలనుకుంట గ్రామ శివారులో ఓ పేకాట స్థావరంపై ఆదివారం ఎస్సై టి.సుధీర్, సిబ్బందితో కలసి దాడి చేశారు. ఈ దాడిలో 5 గురు జూదరులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.41,200 నగదు, 4 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దుర్మార్గం



అంగడాల సీతారావమ్మ

దెందులూరు: మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ దుర్మార్గమని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు అంగడాల సీతారావమ్మ అన్నరు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి సూచనలతో కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. పేదలకు ఉచితంగా విద్య వైద్యం అందించాలని గత ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశమంతా గర్వించేలా ఆదర్శవంతంగా విద్య, వైద్య రంగాల్లో నూతన సంస్కరణలు అమలు చేశారన్నారు. అందుకు భిన్నంగా సమాజంలో పేద బడుగు ముస్లిం మైనారిటీ దళిత గిరిజన వర్గాల ప్రజలకు ఉచిత విద్య, వైద్యం దూరం చేసే విధంగా కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేయటం అన్యాయమన్నారు. కోటి సంతకాల కార్యక్రమానికి తమ వంతు బాధ్యతగా పార్టీ మహిళా విభాగం దెందులూరు నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో చురుకైన పాత్ర పోషిస్తుందన్నారు. త్వరలోనే మహిళా విభాగం సంతకాల సేకరణ కార్యక్రమం పూర్తి చేసి మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, పార్టీ జిల్లా అధ్యక్షురాలు కేసరి సరితారెడ్డికి అందజేస్తామన్నారు. మేదినరావు పాలెం ఎంపీటీసీ అంగడాల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ చేస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు.

ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకు ఉద్యమం

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయానికి మద్దతు తెలుపుతున్నామని మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి గొల్ల కిరణ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునేవరకు మాల మహానాడు పోరాటం చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

పేదలకు ఉచిత వైద్యమే లక్ష్యం



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య బృందం

భీమడోలు: సామాజిక సేవే లక్ష్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్, ఏలూరు శ్రీకృష్ణ ఆసుపత్రి అధినేత డాక్టర్ బి.కృష్ణ అన్నారు. గుండుగొలను గ్రామంలోని తోట వారి కాంప్లెక్స్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గుండుగొలనుతో పరిసర గ్రామాలకు చెందిన వందలాది మంది రోగులకు వైద్య బృందం పరీక్షలు చేశారు. బీపీ, షుగర్, ఎముకల పటిష్టత ఎక్స్‌రే, స్కానింగ్ వంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లెల్లో పేద, మధ్య తరగతి వారికి మేలు చేసేందుకు వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు శిరిబత్తిన కొండబాబు, వైద్యులు బర్ల రమణమూర్తి, ఉమాశంకర్, పెద్దలు పూడి శ్రీనివాస్, గేదెల శ్రీను, తోట రవికుమార్, పూడి సత్యనారాయణ, అరసంకల సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎర్ర కాలువ జలాశయానికి తగ్గుతున్న వరద

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం కేకేఎం ఎర్రకాలువ జలాశయానికి వస్తున్న వరద తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు జల్లేరు జలాశయానికి వరద వచ్చి చేరుతోంది. దీంతో ఆదివారం ఎర్రకాలువ జలాశయం డీఈ సునీత, ఏఈ రాహుల్ సిబ్బందితో కలిసి వరద పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ సునీత మాట్లాడుతూ ప్రస్తుతం వరద తగ్గుముఖం పట్టిందన్నారు. ఆదివారం సాయంత్రానికి జలాశయం నీటిమట్టం 82.79 మీటర్ల వద్ద ఉందని, పూర్తి స్థాయి నీటిమట్టం 83.50 మీటర్లు అని తెలిపారు. అలాగే ఇన్‌ఫ్లో 1875 క్యూసెక్కులు ఉండగా, ఔట్‌ఫ్లో 2274 క్యూసెక్కులుగా ఉందని తెలియజేశారు. వరద ఉధృతి తగ్గడంతో అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

రైలు ప్రయాణం అందని ద్రాక్షేనా?

రైల్వే అధికారులు చర్యలు చేపట్టాలంటున్న ప్రజలు



మూతబడిన ఉంగుటూరు రైల్వే స్టేషన్ ఇదే

ఉంగుటూరు: బ్రిటీష్ కాలం నుంచి లక్షలాది మంది ప్రజలు ప్రయాణ అవసరాలు తీర్చిన రైలు ప్రయాణం ప్రస్తుతం అందని ద్రాక్షలా తయారైంది. జిల్లాలో రైలు మార్గంలో ఉన్న గ్రామీణ ప్రాంత రైల్వే స్టేషన్లు రైళ్లు ఆగకపోవడంతో మూతపడ్డాయి. ఏలూరు నుంచి మొదలుకుని రాజమండ్రి మధ్య రైల్వే స్టేషన్లలో రైళ్లు ఆగకపోవడంతో ఆ మార్గం వెంబడి గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 13 రైల్వే స్టేషన్లు మూత పడ్డాయి. ఒకప్పుడు ఈ రైల్వే స్టేషన్లు ప్రయాణ అవసరాలు తీర్చడానికి ప్రధాన భూమిక పోషించాయి. అప్పుడు ప్యాసింజర్ రైళ్లు విరివిగా నడిచేవి. అలాంటిది రైల్వే శాఖ క్రమంగా ప్యాసింజర్ రైళ్లను రద్దు చేసింది. దీంతో ఆ స్టేషన్లు అలంకార ప్రాయంగా కనిపిస్తున్నాయి. ఇటీవల ఈ స్టేషన్లు ఉన్న బోర్డులను కూడా తొలగించారు. దీంతో ఆ స్టేషన్లు బోసుపోతూ కనిపిస్తున్నాయి. ఈ గ్రామీణ ప్రాంత ప్రజలు దూర ప్రాంతాల్లో ఉన్న పట్టణాలకు చేరుకుని తమ ప్రయాణాలు సాగించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

మూతపడిన పలు రైల్వే స్టేషన్లు

పెరిగిన సాంకేతికత గ్రామీణ ప్రాంతాలకు ఉపయోగపడాలని నాయకులు ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప గ్రామీణ ప్రాంత ప్రజలకు ఆచరణలో ఉపయోగపడటం లేదు. జిల్లాలో వట్లూరు, సీతంపేట, దెందులూరు, భీమడోలు, పూళ్ల, కైకరం, చేబ్రోలు, ఉంగుటూరు, బాదంపూడి, నవాబుపాలెం, మారంపల్లి, చాగల్లు , పశివేదల, స్టేషన్లలో చేబ్రోలు, భీమడోలు మినహా మిగిలిన స్టేషన్లు మూత పడ్డాయి. ఫాస్ట్ ప్యాసింజర్ మాత్రం భీమడోలు, చేబ్రోలు స్టేషన్లలో ఆగుతుంది. మిగిలిన స్టేషన్లలో ఒక్క రైలూ ఆగడం లేదు. ఈ స్టేషన్లలో రైల్వే సిబ్బంది లేరు. ఒకప్పుడు పట్టణాలకు వెళ్లాలంటే ప్యాసింజర్ రైలుకు ప్రయాణం చేసి చేరుకునే వారు. నిరుద్యోగులు, ఉద్యోగులు, వ్యాపారులు ఈ రైలు మీదనే ప్రయాణం చేసి వారి అవసరాలు తీర్చుకునే వారు. ఎంతో మంది సీజను టికెట్లతో ప్రయాణించేవారు. ప్రస్తుతం ఈ స్టేషన్లు వెలవెలబోతున్నాయి. గ్రామీణ ప్రాంత ప్రజలకు రైళ్లన్నీ ఆ గ్రామాల మధ్య నుంచే వెళుతున్నా స్టేషన్లలో ఆగకపోవడంతో రైలు ప్రయాణం వారికి అందని ద్రాక్షలా మారింది. రైల్వే శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు పునరాలోచించి గ్రామీణ ప్రాంత ప్రజల ప్రయాణ అవసరాలు తీర్చడానికి ప్యాసింజర్ రైళ్లను పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రస్తుత పార్లమెంట్ సభ్యులుకు ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేసినా పెడచెవిన పెడుతున్నారు. పార్లమెంటు సభ్యులు చెప్పినా రైల్వే పరిపాలనా అధికారులు మాత్రం ఖాతరు చేయడం లేదు. దీంతో ప్రజల రైల్వే కష్టాలు తీరడం లేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.